సాక్షి
వికారాబాద్
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ సుధీర్ సూచించారు. 8లో▸



భవనాలకు గ్రహణం

మండల కేంద్రమైన దోమలో ప్రభుత్వ భవనాలకు గ్రహణం పట్టింది. చాలాకాలం గా పనులు సాగుతూనే ఉన్నాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
6:35	4:45

న్యూస్‌రీల్

ఇఫ్తార్ విందులో స్పీకర్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పండు తినిపిస్తున్న ముస్లిం సోదరుడు

అనంతగిరి: వికారాబాద్‌లోని మధు కాలనీ మసీదులో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, రమేష్ కుమార్, మైపాల్‌రెడ్డి, వహిద్‌మియా, అలీమొద్దీన్, కరీం, సర్ఫరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంత పెద్ద చేపలో..

కొండకల్ వీరన్న చెరువులో చిక్కిన పది కిలోల చేపలు



పది కిలోల చేపలను చూపిస్తున్న మత్స్యకారులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలం కొండకల్ సమీపంలో ఉన్న వీరన్న చెరువులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లిన వారికి పది కిలోల బరువున్న రెండు పెద్ద చేపలు చిక్కాయి. వీటిని చూసిన మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఈ చెరువులో ఇంత పెద్ద చేపలు లభించలేదని చెప్పారు. చెరువులో 10 కిలోల చేపలు చిక్కాయని తెలియడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి వాటిని ఆసక్తిగా చూశారు. ఇలాంటి భారీ చేపలతో మత్స్యకారులకు మంచి లాభాలు ఉంటాయని సంఘం అధ్యక్షుడు మన్నె నర్సింలు తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.5 లక్షలు స్వాధీనం

షాబాద్: వాహన తనిఖీల్లో రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కాంతారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ చెక్ పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మండల పరిధిలోని కక్కులూర్ గ్రామానికి చెందిన చాకలి తిరుపతయ్య తన కారులో రూ.5 లక్షలు తీసుకుని షాబాద్ వైపు వస్తున్నాడు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సదరు మొత్తాన్ని సీజ్ చేసి డీసీబీ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో తనిఖీ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని పలు రేషన్‌షాపుల్లో బుధవారం పౌర సరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బాలసరోజ మాట్లాడుతూ.. రేషన్‌షాపుల్లో బయోమెట్రిక్ యంత్రాలు దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదుతో కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలి పారు. ఈ తనిఖీల్లో ఒక రేషన్ దుకాణానికి చెందిన యంత్రం మరొక షాపులో ఉండటాన్ని గుర్తించామని ఆయన తెలిపారు.

నమ్మక ద్రోహులకు గుణపాఠం చెప్పండి



కార్యకర్తల సమావేశంలో అభివాదం చేస్తున్న కేటీఆర్

- అనామకులైన గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీలను చేసింది కేసీఆరే
- వారు తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకం
- కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

వికారాబాద్: "గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇద్దరూ విశ్వాస ఘాతకులే.. అనామకులైన వారిని కేసీఆర్ అక్కున చేర్చుకొని ఎంపీలు చేస్తే.. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు వ్యవహరించారు" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. నమ్మించి మోసం చేసిన వారిద్దరికీ ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బుధవారం వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విశ్వాసం లేని వ్యక్తి అని, గడ్డం రంజిత్‌రెడ్డి రన్నింగ్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. రంజిత్‌రెడ్డి మరీ దారుణంగా మోసం చేశారని అన్నారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య నిర్వాకం వల్లే వికారాబాద్‌లో ఆనంద్, తాండూరులో రోహిత్‌రెడ్డి ఓడిపోయారని పేర్కొన్నారు. పరిగి కార్యకర్తల సమావేశంలో మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి కలిసి డ్రామాలు చేసింద్రు.. తాము పార్టీ మారడం లేదని చెప్పారు.. వీరి యాక్టింగ్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందేనని ఎద్దేవా చేశారు. మంత్రి అవుతానని మహేందర్‌రెడ్డి కలలో కూడా ఊహించి ఉండడని అలాంటి వ్యక్తిని కేసీఆర్ మంత్రిని చేస్తే నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నమ్మక ద్రోహులకు బుద్ధి చెప్పాలని కోరారు.

సొంత జిల్లాను విస్మరించిన సీఎం: సబితారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను కూడా విస్మరించారని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఆరోపించారు. జిల్లాకు వచ్చిన ప్రతిసారీ కొడంగల్ అంటున్నాడు.. నిధులన్నీ సొంత నియోజకవర్గానికే కేటాయిస్తున్నాడు.. పరిగి, వికారాబాద్, తాండూరు ఆయన సొంత జిల్లాలోని కావా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంత ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో కర్రుగాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలైనా ఒక్కసారి కూడా పాలమూరు గురించి మాట్లాడారా..? అధికారులతో సమీక్ష నిర్వహించారా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో వికారాబాద్ జిల్లాగా ఏర్పాటైందని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి అన్ని వనరులు సమకూర్చారని పేర్కొన్నారు. కలెక్టరేట్, మెడికల్ కళాశాల బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్మించారని తెలిపారు. కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం లాంటిదన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ప్రస్తుత ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలను ఓడించాలని కోరారు. బడుగుల నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

సేవ చేసే వారినే గెలిపించండి: కాసాని

జిల్లాలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశాను.. నా గురించి మీకందరికీ తెలుసు.. నన్ను గెలిపిస్తే మరింత సేవ చేస్తానని బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గురించి అందరికీ తెలుసని, వారి గురించి కొత్తగా చెప్పేదేమీ లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే కరువు వస్తది అంటారు.. ఇప్పుడు అదే జరిగిందన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడారు. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి కొమ్ముకాసే నాయకులను నమ్మరాదని సూచించారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే ముందు వరుసలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మెతుకు ఆనంద్ తెలిసో తెలియకో కొందరిని దూరం చేసుకున్నారని, పని చేసిన వారికి పదవులు ఇవ్వకుండా కొత్తవారికి ఇవ్వడం వల్లే కొంత నష్టం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్, కార్తీక్‌రెడ్డి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం సేకరణకు సిద్ధం కండి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యం సేకరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎనిమిది మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, మరో రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో పొరపాట్లు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కాంటాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ శాతం కొలిచే మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, లైటింగ్ తదితర వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది లక్ష 93 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చునని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. వర్షపు నీరు నిలవకుండా, రవాణాకు సౌకర్యవంతంగా ఉండే స్థలాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రైతుల కోసం టెంట్లు, తాగు నీటి వసతి కల్పించాలని సూచించారు. క్వింటాలు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణాబాయి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీఓ ఈశ్వరయ్య, డీఎంసీఎస్ మేనేజర్ శ్యాంసుందర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలపై గడపగడపకూ ప్రచారం చేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మీర్‌పేట: వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు క్లోం పద్మ తన అనుచరులతో కలిసి బుధవారం అనితారెడ్డి, కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అనితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు రవినాయక్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధీర్

శాశ్వత పనులకు ప్రాధాన్యం

జెడ్పీ సీఈఓ సుధీర్

మర్పల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్పీ సీఈఓ సుధీర్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో దీర్ఘకాల ప్రయోజనాలు కలిగే పనులు చేపట్టాలన్నారు. పొలాల వద్దకు వెళ్లేందుకు ఫార్మేషన్ రోడ్లు, చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, చెరువుల నుంచి పొలాలకు కాలువ తవ్వకం పనులు చేపట్టాలని సూచించారు. రైతులు అదనపు ఆదాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మేకలు, గొర్రెలు, బర్రెల షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. పురాతన బావుల్లో పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యవసాయ బావులు, బోర్లు ఉన్న రైతులు పండ్ల తోటల పెంపకం, ఆయిల్ పాం తోటలు పెంచేలా సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. అంతకుముందు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణారావు, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి కోరారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలకు సంబంధించి జిల్లాలో కంట్రోల్ యూనిట్స్, బ్యాలట్ యూనిట్స్, వీవీ ప్యాట్ల మొదటి దశ రాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 1,148 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికలకు సిబ్బందిని సమాయత్తం చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులు, భద్రతపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అలసత్వం వద్దు

తాగునీటి సరఫరాలో అలసత్వం వహించరాదని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తాగు నీటి పైప్‌లైన్ పాడైతే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాబు శ్రీనివాసు, నాగేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జాగ్రత్తలు పాటించండి

ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని, అనారోగ్యం బారిన పడకుండా అధికారులు తగు సూచనలు చేయాలని ఆదేశించారు. ఎండలో పని చేయరాదని, ఆటలకు వెళ్లరాదని, చెప్పులు లేకుండా బయట తిరగడం వంటివి చేయరాదని సూచించారు. శరీర ఉష్ణోగ్రతలు 40.5 సెంటీ గ్రేడ్ కంటే ఎక్కువగా నమోదైనా, విపరీతమైన చెమట, దాహం వేసినా, నీరసంగా ఉన్నా, తలతిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రంలో పాలన గాడితప్పింది

- గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే
- లోక్‌సభ ఎన్నికల్లో వాటికి బుద్ధి చెప్పాలి
- మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

షాద్‌నగర్: రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ క్లాంప్లెక్స్‌లో బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఆర్భాటాలకు పోయి ఆరు గ్యారంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిందని.. వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

పాలమూరు ప్రాజెక్టుపై వైఖరేమిటి?

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని అరుణ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చేలా మొదట్లో డిజైన్ చేశారని, ఆ తర్వాత మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత డిజైన్ ఆమోదించి పరిపాలన అనుమతులు ఇప్పిస్తే కేంద్రం నుంచి తాము నిధులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్, బీఆర్ ఎస్ విభజన హామీ చట్టంలో ఎందుకు పొందుపర్చలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల ఊసేలేదు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీని అధికారంలోకి రానీయకుండా ఆ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, దేశంలో కాంగ్రెస్ పార్టీల ఊసేలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ఎవరూ అంగీకరించడం లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, వెంకటేష్‌గుప్తా, డీకే సిగ్మారెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్మరి భూపాలాచారి పాల్గొన్నారు.


మోదీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

కొందుర్గు: దేశ ప్రజలు మళ్లీ నరేంద్రమోదీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని డీకే అరుణ అన్నారు. చౌదరిగూడ ఆర్య సమాజంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుపొందడం ఖాయమని, అందులో మహబూబ్‌నగర్ తప్పకుండా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పై ఇష్టం లేక కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలంతా బీజేపీకి ఓటు వేస్తారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భూపాల చారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్‌కు చెందిన ముగ్గురు మాజీ సర్పంచులు, వారి అనుచరులు, మీర్జాగూడకు చెందిన మాజీ సర్పంచ్ తన అనుచరులతో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరం కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. పార్టీలో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రేగడిఘనాపూర్‌కు చెందిన మాజీ సర్పంచులు తిప్పని రాంరెడ్డి, రాయికంటి నర్సింలు, షాబాద్ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, యాదయ్య, నాయకులు కిష్టయ్య, పాండు, మీర్జాగూడ మాజీ సర్పంచ్ భీమయ్య తది తరులు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డి, భీంభరత్‌ను సన్మానిస్తున్న నాయకులు

క్లుప్తంగా

గద్వాల కోఆర్డినేటర్‌గా రఘువీరారెడ్డి



ధారూరు: నాగర్‌కర్నూల్ జిల్లా గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా ధారూరు మండలానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డిని నియమించారు. బుధవారం ఈ మేరకు టీపీసీసీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. నాకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొనిపోయి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపునకు కృషిచేస్తానని అన్నారు.

బ్రిడ్జిపై ఆగిపోయిన బస్సు

ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఫెయిలయ్యింది. బస్సు ముందుకు కదలకపోవడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో రెండు వైపులా దాదాపు గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీఐ నాగరాజు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేయడంతో వాహనాలు ముందుకు సాగాయి.

బాలిక అపహరణ కేసు సుఖాంతం

- సఖి సెంటర్‌కు తరలింపు
- ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్

కుల్కచర్ల: బాలికను అపహరించిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు. ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాలు.. కుల్కచర్ల మండలం సాల్వీడుకి చెందిన బాలిక(15) గతనెల 29వ తేదీన పదవ తరగతి పరీక్షల అనంతరం పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఎంతవెతికినా బాలిక జాడ దొరకలేదు. దీంతో మార్చి 31వ తేదీన కుల్కచర్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఈ కేసులో నిందితులైన సాల్వీడు గ్రామానికి చెందిన గోపాల్ మరియు హన్మాడ మండలానికి చెందిన రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. బాలికను వారిచెడ నుంచి విడిపించి సఖి సెంటర్‌కు తరలించారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉపాధి కూలీ రూ.600కు పెంచండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

యాచారం: ఉపాధి కూలీలకు రూ.600 చొప్పున వేతనం పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బుధవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఎండల తీవ్రతకు కూలీ గిట్టుబాటు కావడం లేదని, తాగునీటి, నీడ సౌకర్యాలు లేవని, చేసిన పనులకు ప్రతీ వారం వేతనాలు రావడం లేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా తేలికపాటి పనులు చూపించాలని, చేసిన పనులకు ప్రతీ వారం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని అధికారులను కోరారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏ పాపకూ ఇలా జరగకూడదు

- గిరిజన బాలికల సంక్షేమ పాఠశాల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత
- తల్లిదండ్రులకు ఆలస్యంగా సమాచారమిచ్చిన నిర్వాహకులు
- వికారాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించిన కుటుంబ సభ్యులు
- ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని మీడియాకు వీడియో షేర్ చేసిన తండ్రి



జినుగుర్తిలోని తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ పాఠశాల

తాండూరు రూరల్: విద్యార్థినులను కంటికి రెప్పలా కాపాడాల్సిన హాస్టల్ నిర్వాహకులు కఠినంగా వ్యవహరించారు. ఓ విద్యార్థిని ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తీవ్ర అనారోగ్యానికి గురైన తనపాపను ఆ తండ్రి వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. విద్యార్థిని ప్రసుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తన పాపకు జరిగిన అన్యాయం ఏ పాపకు జరగకూడదని ఆ తండ్రి ఆస్పత్రి నుంచి వీడియో తీసి మీడియాకు పంపించారు. హాస్టల్ నిర్వాహకులు, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆ వీడియోలో కోరారు.

లేటుగా సమాచారం ఇచ్చిన నిర్వాహకులు..

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన రాములు నాయక్ తన ఇద్దరు ఆడ పిల్లలను తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో చదివిస్తున్నాడు. అమృత 9వ తరగతి, లోకేశ్వరి 7వ తరగతి అక్కడే హాస్టల్లో ఉంటు చదువుతున్నారు. అమృత ఆరోగ్యం బాగా లేదని వాంతులు, విరేచనాలు చేసుకుంటుందని గతనెల 26వ తేదీన తండ్రి రాములుకు హాస్టల్ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. అప్పటికే పాప తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది. హాస్టల్‌కు చేరుకున్న పాప తండ్రి వెంటనే అమృతను అంబులెన్స్‌లో వికారాబాద్‌లోని మహవీర్ ఆస్పత్రికి తరలించారు. అమృత బాడీ ఇన్‌ఫెక్షన్‌కు గురైందని పరిస్థితి బాగాలేదని హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు.

అంత స్థోమత లేదు సారూ..

హైదరాబాద్‌కు తీసుకెళ్లే స్థోమత తనకు లేదని ఇక్కడే వైద్యం అందించాలని రాములు వైద్యులను కోరాడు. ఇప్పటివరకు పాప వైద్యం కోసం రూ.70వేల వరకు ఖర్చు చేశానని ప్రస్తుతం అమృత కోలుకుంటోందని తెలిపాడు. గిరిజన బాలికల వసతి గృహం నిర్వాహకులు, ప్రిన్సిపాల్ నిర్లక్ష్య కారణంగానే తనపాప ఆరోగ్యం క్షీణించిందని రాములు సెల్‌ఫోన్‌లో ఓ వీడియో తీసి మీడియాకు షేర్ చేశాడు. హాస్టల్లో ఉన్న తమ పిల్లలను చూసేందుకు వెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని చెప్పారు. హాస్టల్‌లో సరైన సౌకర్యాలు ఉండవని నాణ్యతలేని ఆహారంతో పాప అనారోగ్యానికి గురైందని తెలిపారు. తన పాపకు వచ్చిన కష్టం ఏ విద్యార్థినికి రాకూడదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమృతతో తండ్రి రాములు

ఆరోపణలు అవాస్తవం

వెంకటాపూరం తండాకు చెందిన అమృత, లోకేశ్వరి మా గిరిజన సంక్షేమ వసతి పాఠశాలలో చదువుతున్నారు. అమృత సరిగ్గా ఆమె ఆరోగ్యంపై శ్రద్ధ చూపదు. దీంతో అనారోగ్యానికి గురైంది. అమృత తండ్రి ఆరోపణలు అవాస్తవం.

– పార్వతమ్మ, ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమ పాఠశాల

చెట్టు పైనుంచి పడి..

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మర్పల్లి మండలం పట్లూర్‌లో విషాదం



ప్రమాదస్థలిలో రాజు

మర్పల్లి: చింతచెట్టు ఎక్కి చింతపండు రాలుపుతుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పట్లూర్‌లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మర్పల్లి ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు... మండల పరిధిలోని పట్లూర్‌కి చెందిన డప్పు అంతయ్యకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె కలదు. చిన్న కుమారుడు డప్పు రాజు (35) మంగళవారం ఉదయం పట్లూర్‌కి చెందిన అంతయ్యతో కలిసి తుమ్మలపల్లి గ్రామ శివారులోని మల్లన్న పటేల్ వ్యవసాయ పొలంలో గల చింతచెట్టుకు చింతపండు రాల్చేందుకు వెళ్లాడు. చింతపండు రాలుపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు రాజు చెట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలవ్వగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు.. అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాజు మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండి అంతయ్య ఫిర్యాదు మేరకు శవ పంచనామ అనంతరం మృతదేహాన్ని కుటుంభ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అఖిల్

పెద్దేముల్: 'దాహమో రామచంద్ర' అనే శీర్షికతో 'సాక్షి' జిల్లా ఎడిషన్‌లో బుధవారం ప్రచురితమైన కథనానికి పెద్దేముల్ మండల అధికారులు స్పందించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అఖిల్, ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి అరుణతో పాటు సిబ్బంది సిద్ధన్నమడుగు తండాకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఏఈఈ హామీ ఇచ్చారు. ట్యాంకు వద్ద గేట్‌వాల్ పనిచేస్తుందా.. లేదా అని పంచాయతీ కార్యదర్శి అరుణను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డుకు నీరు అందేలా గేట్‌వాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని ఏఏ గ్రామాల్లో నీటి సమస్య ఉందో తెలియజేయాలని అధికారులు తెలిపారు.



తండాలో నీటివాల్వ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యోగ విరమణ సహజం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



నరహరిని సన్మానిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మాస్‌మీడియా జిల్లా అధికారిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన నరహరికి బుధవారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... వృత్తిలో ఉన్నంత వరకు మనం చేసిన సేవలు ప్రజలకు చిరకాలం గుర్తుంటాయని అన్నారు. వైద్య,ఆరోగ్య శాఖలో నరహరి వివిధ విభాగాల్లో పని చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం హర్షనీయమన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ సేవలు అందించారని అన్నారు. వైద్యాఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలను ఆయన ఎంతో సమర్థవంతంగా అమలు చేశారని అన్నారు. అనంతరం నరహరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డాక్టర్ చందులాల్ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చీలాపూర్ గేటు వద్ద చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌కి చెందిన పాండు(48) , లక్ష్మి.. బుధవారం బైక్‌పై మన్నేగూడకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో పాండు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో లక్ష్మికి తీవ్రగాయాలవ్వగా ఆస్పత్రికి తరలించారని.. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్ గ్రామ శివారులోని వాగులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అర్ధ రాత్రి దాటితే చాలు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో మంగళవారం రాత్రి కరన్‌కోట్ పోలీసులు దాడిచేసి గోనూర్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు రాజు, తుకారంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో ఇంకా చాలా ట్రాక్టర్లలో రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

కోపంతో కారును కాల్చేశాడు

మైలార్‌దేవ్‌పల్లి: ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన గొడవతో ఓ కారు దగ్ధమైన సంఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది .పోలీసుల తెలిపిన ప్రకారం.. ఆరాంఘర్ చౌరస్తాలో ప్రతి రోజు ఉదయం కర్నూల్ ,హైదరాబాద్‌కు ప్రయాణికులను తమ ప్రైవేట్ వాహనాల్లో సీరియల్ ప్రకారం తీసుకెళుతుంటారు. బుధవారం హసన్ నగర్ ప్రాంతానికి చెందిన అడ్డు సీరియల్ ప్రకారం రాలేదని మరో డ్రైవర్‌తో గొడవ పడ్డాడు. దీంతో నన్నే సీరియల్ ప్రకారం రమ్మంటావా అంటూ అడ్డు తన కారు అద్దాన్ని బండరాయితో ధ్వంసం చేశాడు. దీనిని ఓ డ్రైవర్ వీడియో తీస్తుండగా ఆగ్రహానికి లోనైన అడ్డు అతడి చేతిలోని ఫోన్ లాక్కుని నేలకేసి కొట్టాడు. ఫోన్ పగిలి పోవడంతో సదరు డ్రైవర్ అడ్డు కారు తాళం తీసుకున్నాడు. తాళం తీసుకుంటావా అంటూ కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

జెడ్పీ సీఈఓ సుధీర్

మోమిన్‌పేట: గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ పేర్కొన్నారు. మోమిన్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సామేశమై మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎట్టి పరిస్థితిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయడంతో పాటు మిషన్ భగీరథ నీరు రానప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిరోజు ఉపాధి కూలీల సంఖ్య పెరిగే విధంగా కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఏ గ్రామంలో తక్కువగా కూలీలు వస్తున్నారో ఆ గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి, వ్యవసాయాధికారి జయ శంకర్, ఏపీఓ శంకర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధీర్

పకడ్బందీగా లోక్‌సభ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు: లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. తాండూరు పట్టణంలోని నంబర్–1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. మూడురోజులపాటు ఈ శిక్షణ కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. పోలింగ్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎం మెషీన్ల వలన పోలింగ్ నిలిచిపోతే వెంటనే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవీఎం మెషీన్లు వాడే విధానాన్ని మాస్టర్ ట్రైనర్లు శిక్షణ కల్పిస్తారన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు తారాసింగ్, కిషన్, వెంకటేష్, మునిరొద్దీన్, రెవెన్యూ సిబ్బంది, పోలింగ్ అధికారులు తదితరులున్నారు.

స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం

- ఆక్రమిత భాగాన్ని కూలగొట్టిన అధికారులు
- మనస్తాపంతో ఉరివేసుకుని బాధితుడి ఆత్మహత్య

ధారూరు: ఇంటి నిర్మాణంలో భాగంగా పక్కనే ఉన్న కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న విషయమై అధికారులు షోకాజ్ నోటీసు జారీచేశారు. అయితే సదరు వ్యక్తి వారి ఆదేశాన్ని పాటించకుండా స్థలం ఆక్రమించి నిర్మిస్తుండటంతో మంగళవారం అధికారులు ఆక్రమణ భాగాన్ని కూల్చేసారు. దీంతో మనస్తాపానికి గురై ఆ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు.. ధారూరు మండల పరిధిలోని హరిదాస్‌పల్లికి చెందిన అమృతమ్మ, సుదర్శన్(50) దంపతులు. గ్రామంలో వీరు కొనుగోలు చేసిన ప్లాట్‌లో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టారు. వారి స్థలంతో పాటు పక్కనే ఉన్న రోడ్డులో కొంత స్థలాన్ని, మరో పక్కన ఉన్న పెంటయ్య స్థలాన్ని కొంత ఆక్రమించి వారు ఇల్లు నిర్మిస్తుండటంపై గ్రామ పంచాయతీలో పెంటయ్య ఫిర్యాదు చేశాడు. ఎంపీఓ షఫీఉల్లా, గ్రామ కార్యదర్శి కలిసి ఇంటి నిర్మాణ కొలతలు తీసి ఆక్రమించిన స్థలంలో కట్టిన నిర్మాణాన్ని తొలగించాలని సుదర్శన్‌కు నోటీసులు అందజేశారు. అయితే సుదర్శన్ వారి మాటలు లెక్కచేయకుండా నిర్మాణాన్ని కొనసాగించాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ నర్సింహులు, గ్రామ కార్యదర్శి మంగళవారం పోలీసుల సహాయంతో ఆక్రమించిన భాగంలో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సంఘటనతో మనస్తాపానికి గురైన సుదర్శన్ అదేరోజు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుదర్శన్‌కు భార్య అమృతమ్మ, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా సుదర్శన్ ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ నాయకుడు భిక్షపతి, రాఘవేందర్, రవీందర్, శేఖర్, శ్రీనివాస్, రాకేశ్ డిమాండ్ చేశారు.

బాధితులకు న్యాయం చేయండి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్‌లోని 16వ డివిజన్ పరిధిలోని శ్రీ సాయికృపానగర్ కాలనీలో మంగళవారం విద్యుత్ హైటెన్షన్ లైన్ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 30 ఇళ్లలో గృహోపకరణాలు పాడయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి బుధవారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాలనీలో ఓ ప్రైవేట్ సెల్యూలర్ కంపెనీ స్తంభాల వల్లే షార్ట్ సర్క్యూట్ జరిగిందని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ఎమ్మెల్యే మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని పిలిపించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కు భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే..

షార్ట్ సర్క్యూట్ సంభవించిన ఇళ్లను మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాడైన గృహోపకరణాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మీర్‌పేట పోలీసులకు తెలిపారు. ఆయన వెంట బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, కాలనీ అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



షార్ట్ సర్క్యూట్ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

నాగర్‌కర్నూల్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి

అమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డా.మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనను ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ఆమనగల్లులో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో ఉన్న వారితో ముచ్చటించారు. కొద్దిసేపు పూరీలు కాల్చి ఆకట్టుకున్నారు. అనంతరం హోటల్‌లో టిఫిన్ చేస్తున్న పలువురు మహిళలతో మాట్లాడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఎలా ఉంది.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం బాగుందా.. పార్టీ మహిళలకు అమలు చేస్తున్న పథకాలు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్‌పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓటమి తప్పదన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, కృష్ణనాయక్, మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మాణయ్య, నాయకులు బాల్‌రాం, వస్పుల శ్రీకాంత్, అలీం, నాజర్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



హోటల్‌లో టిఫిన్ చేస్తున్న యువతితో ముచ్చటిస్తున్న మల్లురవి

పీఎస్‌కు పిలిపించి కొట్టారు

- వివాదాస్పదమవుతున్న యాలాల ఎస్‌ఐ వ్యవహారం
- విచారణ పేరిట ఠాణాకు పిలిచి కొట్టాడని మాజీ సర్పంచ్ భర్త ఆరోపణ
- న్యాయం చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

యాలాల: విచారణ పేరిట పోలీస్ స్టేషన్‌లో ఓ మాజీ సర్పంచ్ భర్తను తీవ్రంగా కొట్టారనే ఆరోపణల్లో యాలాల ఎస్‌ఐ శంకర్ చేరారు. బాధితుడు గత వారం రోజులుగా తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ కోటిరెడ్డి, తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డిని ఆశ్రయించడంతో ఈ వ్యవహారం మరింత వేడెక్కింది. దీనికి తోడు బాధితుడికి ప్రజా సంఘాలు అండగా నిలుస్తున్నాయి.

ఆరోపణలు ఇలా..

మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ మాజీ సర్పంచ్ కవిత భర్త భీమప్ప వ్యవసాయ కూలీ. మార్చి 25న అదే గ్రామానికి చెందిన బక్ల శ్రీను అనే వ్యక్తితో భీమప్పకు చిన్నపాటి విషయమై వాగ్వాదం జరిగింది. ఈ విషయమై మరుసటి రోజు బక్ల శ్రీను యాలాల ఠాణాలో భీమప్పపై ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ శంకర్ మార్చి 27న భీమప్పకు ఫోన్‌చేసి పీఎస్‌కు పిలిపించి గ్రామస్తుల సమక్షంలోనే రబ్బరు కర్రతో.. చేతులు, పిరుదులపై ఏకధాటిగా కొట్టడంతో పాటు బూటుకాళ్లతో తన్నాడని బాధితుడు భీమప్ప ఆరోపించాడు. వ్యవసాయ పనులు చేసుకునే తాను.. తన భార్య సర్పంచ్‌గా గెలిచాక ప్రజాసేవలో ఉన్నానని.. తనను గ్రామస్తుల సమక్షంలో ఎస్‌ఐ కొట్టడంతో మానసిక క్షోభకు గురయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనతో పాటు పీఎస్‌కు వచ్చిన తన తమ్ముడు శ్రీశైలంను సైతం ఎస్‌ఐ కొట్టాడని ఆయన తెలిపాడు. ఈ విషయంలో ఎస్‌ఐ బాధితుడిని పరోక్ష పద్ధతిలో బెదిరిస్తున్నాడని.. ఇది పద్ధతి కాదని దళిత, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. అధికారం చేతిలో ఉందని సామాన్యుడిని కేసుల పేరిట భయ భ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. భీమప్పను విచారణ పేరిట తీవ్రంగా కొట్టిన ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కుర్వ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

డీఎస్పీని కలిసిన నాయకులు..

కాగా ఈ ఘటనపై మంగళవారం బాధితుడితో కలిసి తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని ప్రజా సంఘాల నాయకులు కలిశారు. విచారణ పేరిట గ్రామస్తుల ఎదుట మాజీ సర్పంచ్ భర్తను కొట్టడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణను తాండూరు రూరల్ సీఐ అశోక్ కుమార్‌కు అప్పగించామని.. పూర్తి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న భీమయ్య, పక్కన మాజీ సర్పంచ్ కవిత

భీమప్పను కొట్టలేదు



భీమప్పపై వచ్చిన ఫిర్యాదు మేరకు పీఎస్‌కు పిలిపించి మందలించాను. అతడిని నేను కొట్టలేదు. కొందరు కావాలనే నాపై ఆరోపణలు చేస్తున్నారు.

– శంకర్, ఎస్‌ఐ, యాలాల